సాక్షి

వికారాబాద్

సోమవారం ǀ 2 ǀ అక్టోబర్ ǀ 2023



పత్తి రైతు.. చిత్తు!

పత్తి పంట చేతికొచ్చే సమయంలో చీడ పీడలు సోకి దిగుబడిపై ప్రభావం పడింది. దీంతో రైతులు నష్టపోతున్నారు. 8లో▸



వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

రానున్న ఎన్నికల్లో తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. 8లో▸



స్వచ్ఛతతోనే ఆరోగ్యం

స్వచ్ఛత హీ సేవకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, అప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటామని సర్పంచ్ వీరప్ప అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

కొడంగల్ డాక్టర్‌కు ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు



గవర్నర్ తమిళి సై చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ సుజ్ఞానజ్యోతి

కొడంగల్: దేశ స్థాయిలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి ఇచ్చే ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు– 2023 కొడంగల్‌కు చెందిన డాక్టర్ సుజ్ఞాన జ్యోతిని వరించింది. హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆమె గవర్నర్ తమిళి సై చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సుజ్ఞాన జ్యోతి నాగోల్ సమీపంలో ఎస్‌జీఎం ఆసుపత్రిని స్థాపించి సేవలందిస్తున్నారు. ఏషియా టు డే రీసర్చ్ అండ్ మీడియా ఆర్గనైజింగ్ వారు నిర్వహించే ప్రైడ్ ఆఫ్ నేషన్ – 2023 అవార్డుకు ఆమెను ఎంపిక చేశారు. బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సుజ్ఞానజ్యోతి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గవర్నర్ తమిళి సై చేతుల మీదుగా అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. డాక్టర్ సుజ్ఞానజ్యోతిని ఆమె భర్త మిథున్ చక్రవర్తి, తండ్రి అరిగె వెంకటరత్నం, తల్లి అనురాధ, చిన్నాన్న అనంత ప్రసాద్, చిన్నమ్మ జ్యోతి అభినందించారు.

అసత్య ఆరోపణలు సహించేది లేదు

పీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత



శివగంగ రాజరాజేశ్వర ఆలయం వద్ద అనుచరులతో చిగురింత పారిజాత

మహేశ్వరం: అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత హెచ్చరించారు. ఇటీవల కాంగ్రెస్ బహిష్కృత నేత కొత్త మనోహర్‌రెడ్డి మహేశ్వరం టికెట్ కోసం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి రూ.10 కోట్లు, 5 ఎకరాల భూమి ఇచ్చారని చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త మనోహర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై స్పందించిన పారిజాత మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయానికి రావాలని.. ప్రమాణం చేద్దామని సవాల్ విసిరిన విషయం విధితమే. ఈ క్రమంలో అన్నట్టుగానే ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఆమె తన అనుచరులతో ఆలయం వద్దకు చేరుకున్నారు. 11 గంటల వరకు ఎదురుచూడగా మనోహర్ రెడ్డి రాలేదు. ఆయనకు వ్యతిరేకంగా పారిజాత అనుచరులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహేశ్వరం టికెట్ విషయంలో డబ్బులు, భూమి ఇచ్చినట్లు అధారాలుంటే తీసుకొని రావాలని సవాల్ విసిరితే మనోహర్‌రెడ్డి తోకముడిచారని అన్నారు. నోరుందని ఏది పడితే అది మాట్లాడితే జనం నమ్మరన్నారు. అస్యత ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తే అదే రీతిలో బదులిస్తామని హెచ్చరించారు. మహేశ్వరంలో కాంగ్రెస్ బలోపేతమవుతున్న తరుణంలో కొంతమంది దుష్ట శక్తులు పార్టీని బలహీన పర్చాలని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా మహేశ్వరం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసి సోనియా, రాహుల్ గాంధీ, ఖర్గే, రేవంత్‌రెడ్డికి కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబాయి సుదర్శన్‌రెడ్డి, బండారి మనోహర్, బాలు నాయక్, పార్టీ కందుకూరు మండల అధ్యక్షుడు సబావత్ కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ శివారులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పొందేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 9న కళాశాలలో వాక్ ఇన్ అడ్మిషన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప'రాయి'పాలు

యథేచ్ఛగా ఎర్రరాయి, మట్టి తవ్వకాలు

- అసైన్డ్ భూములనూ వదలని వైనం
- పట్టించుకోని మైన్స్, రెవెన్యూ శాఖల అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం



పెద్దేముల్ మండలం తట్టెపల్లిలో అక్రమంగా తవ్విన ఎర్రరాయి

పెద్దేముల్: కర్ణాటక – తెలంగాణ సరిహద్దులో ఎర్రరాతి, మట్టి అక్రమ తవ్వకాలు ఊపందుకున్నాయి. ఏడాదిలో వర్షాలు పడే నాలుగు నెలలు మినహాయిస్తే మిగిలిన ఎనిమిది నెలలు ప్రభుత్వ భూముల్లో దళారులు యథేచ్ఛగా మట్టి, ఎర్రరాయిని తవ్వేస్తున్నారు. ఈ విషయం రెవెన్యూ, మైన్స్ శాఖల అధికారులకు తెలిసినా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కాలం గడుపుతున్నారు. దీనికి తోడు మండలంలో సుద్ద వ్యాపారం మైన్స్, రాజకీయ నాయకుల అండదండలతో మూడు పూలు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. లక్షల టన్నుల సుద్దను అక్రమంగా తవ్వేసినా ఏనాడు మైన్స్ అధికారులు తనిఖీలు చేసిన పాపాన పోలేదు. మామూళ్లు అందుతుండడం వల్ల వారు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని పెద్దేముల్, కోటపల్లి, ధారూర్, మోమిన్‌పేట, మర్పల్లితో పాటు పలు మండలాల్లో సుద్ద, ఎర్ర మట్టి గనులు ఉన్నాయి. పెద్దేముల్ మండలంలోని మారేపల్లి, తింసాన్‌పల్లి, గోపాల్‌పూర్, నర్సాపూర్, రుద్రారం, పాషాపూర్, జైరాం తండా, జనగాం, ఓంలానాయక్ తండాతో పాటు పలు గ్రామాల్లో సుద్ద, ఎర్రరాయి, ఎర్ర మట్టి నిక్షేపాలు ఉన్నాయి. ఇక్కడ లభించే ముడి సరుకు(సుద్ద)ను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. పాషాపూర్



రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

రెవెన్యూ పరిధిలో సుమారు 1,200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. చాలా ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం సుమారు 500 మంది గిరిజనులకు ఆ భూములను సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ అసైన్డ్ భూముల్లో కూడా యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. అంతేకాకుండా సుమారు 100 ఎకరాల భూమిలో ఎర్రమట్టి తవ్వకాలకు లీజు మంజూరు చేసింది. దీంతో కొంత మంది దళారులు మైన్స్ అధికారుల అండదండలతో లీజు నిబంధనలకు విరుద్ధంగా మట్టిని అక్రమంగా తవ్వుతున్నా పట్టించుకోవడం లేదు. ఎర్ర రాయి అక్రమ వ్యాపారులపై పలు మార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సహజ సిద్ధంగా ఉన్న కొండలు, గుట్టలు కనుమరుగవుతున్నాయి. రెండేళ్ల క్రితం పెద్దేముల్ మండల కందనెల్లి వద్ద మట్టి అక్రమ తవ్వకాలు చేస్తున్నారని అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన యంత్రాలు, టిప్పర్లను సీజ్ చేశారు. ఆదివారం, రెండో శనివారం వచ్చిందంటే ఇసుక దళారులకు పండుగే. కొంత మంది దళారులు పోలీసులకు మామూళ్లు ఇచ్చి ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. గతంలో ఎస్ఐ చంద్రశేఖర్ ఇసుక అక్రమ రవాణా విషయంలో డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. అయినా అధికారుల్లో మార్పు రాలేదని పలువురు అంటున్నారు.

లీజు లేదు.. రాయల్టీ చెల్లించరు

ప్రభుత్వ, పట్టా భూముల్లో ఎర్ర మట్టి, సుద్ద తవ్వకాలు జరపాలంటే ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎన్‌ఓసీ తీసుకొని, మైన్స్ శాఖ ద్వారా లీజు పొందాలి. రాయల్టీ ఫీజును చెల్లించిన తరువాతే మట్టిని తరలించాలి. కానీ ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఎర్రరాయి అక్రమ తవ్వకాలపై మైన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఈ విషయం రెవెన్యూ అధికారులు చూస్తారని అంటున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇది మైన్స్ శాఖ వ్యవహారమని అంటున్నారు. దీంతో అక్రమ వ్యాపారం ఆగడం లేదు. ఈ విషయమై తాండూరు మైన్స్ ఏడీ సాంబశివరావుకు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

- 2040 నాటికి నగరం కార్బన్ డయాక్సైడ్ రహితం
- భవిష్యత్ తరాలకు సైక్లింగ్ అలవాటు చేయాలి
- సైకిల్ ట్రాక్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్



సైకిల్ ట్రాక్‌ను ప్రారంభించి సైకిల్ తొక్కుతున్న మంత్రి కేటీఆర్, ఎంపీ రంజిత్‌రెడ్డి

మణికొండ: ప్రపంచమంతా ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగి వాహన రహిత ప్రయాణాల వైపు వెళ్తోందని, హైదరాబాద్ నగరాన్ని 2040 వరకు కార్బన్ డయాక్సైడ్ రహిత నగరంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆదివారం రాత్రి ఔటర్ రింగ్ రోడ్డు వెంట 23 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన సైక్లింగ్ ట్రాక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. నగరంలో సైక్లింగ్ జోన్లలో ఇది ప్రారంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో కోకాపేట నియోపోలిస్, గండిపేట చెరువు చుట్టూ, బుద్వేల్ సెజ్ వరకు సైక్లింగ్ జోన్లను ఏర్పాటు చేస్తామన్నారు. మధుమేహం, బీపీ బాధితులు సైక్లింగ్‌తో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని సూచించారు. మన దేశంలో డబ్బు వస్తుంటే స్టేటస్ సింబల్‌గా వాహనాలను పెంచుతున్నారని, ఇతర దేశాల్లో ప్రజా రవాణానే ఎక్కువగా వినియోగిస్తారని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రజా రవాణాను పేదలే వాడాలనే ధోరణి పోయి అందరూ వాడే రోజు రావాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్ తరాలను ఆరోగ్యంగా ఉంచాలంటే మన పిల్లలను సైక్లింగ్ వైపు ప్రోత్సహించాలని సూచించారు.

దేశంలోనే మొదటిది..

2022వ సంవత్సరంలో హైదరాబాద్‌లో సైక్లింగ్ జోన్ ఏర్పాటు చేయాలని హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ సభ్యులు తనను సంప్రదించారని, దక్షిణ కొరియాలో సోలార్ ప్యానెల్ కవర్ సైకిల్ ట్రాక్ ఉందని కనుగొని అక్కడకు అధికారులను పంపి నివేదిక తెప్పించుకుని పనులు మొదలు పెట్టామని కేటీఆర్ అన్నారు. సంవత్సర కాలంలో మొదటి విడతగా 23 కిలోమీటర్ల ట్రాక్ సిద్ధమైందన్నారు. ఇది 365 రోజులు 24 గంటల పాటు తెరిచి ఉంటుందన్నారు. మన దేశంలో ఇదే మొదటిదని, ప్రపంచంలోనే రెండోదన్నారు. ప్రస్తుతం దుబాయ్, స్విట్జర్లాండ్‌లలో నిర్మిస్తున్నారని తెలిపారు. సైకిల్ ట్రాక్‌కు రెండు వైపులా రక్షణ, భద్రత ఏర్పాట్లు ఉన్నాయని, సైకిల్ ట్రాక్‌పై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్‌లతో 16 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. దీని వెంట పార్కింగ్, విశ్రాంతి ప్రాంతాలు, ప్రథమ చికిత్స స్టేషన్లు, ఫుడ్ స్టాల్స్, సైకిల్ రిపేర్, రెంటల్ స్టేషన్లు, అయిదు చోట్ల యాక్సెస్ పాయింట్లు ఉంటాయని పేర్కొన్నారు. ఫేజ్ –2లో నార్సింగి హబ్‌లో స్కేటింగ్ రింక్‌లు, టెన్నిస్ కోర్టులు, బ్యాడ్మింటన్ కోర్టులు, స్పోర్టింగ్ రిటైల్, క్రీడా సౌకర్యాలను అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉందన్నారు.

గిన్నిస్ రికార్డు సృష్టిస్తాం..

హైదరాబాద్ సైకిలిస్ట్ గ్రూప్, హైదరాబాద్ సైక్లింగ్ రివల్యూషన్ ఆధ్వర్యంలో 2024లో ఒకేసారి 3వేల మంది సైక్లిస్టులతో గిన్నిస్ రికార్డు సృష్టించాలని నిర్ణయించినట్లు ఆయా గ్రూపుల నిర్వాహకులు సెల్వన్ సంతాన, రవీందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనిత మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్, అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ బి. ప్రభాకర్, హెచ్‌జీసీఎల్ సీజీఎం రవీందర్, నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ రేఖ యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేశ్ యాదవ్, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కాసం షో రూమ్‌ను ప్రారంభిస్తున్న నేహాశెట్టి

నేహాశెట్టి సందడి

వికారాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలో ఆదివారం సినీ హీరోయిన్ నేహాశెట్టి సందడి చేశారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాసం ఫ్యాషన్ షో రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు సరసమైన ధరలకు అన్ని రకాల వస్త్రాలు కాసంలో అందుబాటులో ఉంటాయన్నారు. ఇక్కడి ప్రజలు వస్త్రాలు కొనేందుకు హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్లకుండా అన్ని రకాలు ఇక్కడే లభించేలా యాజమాన్యం ఏర్పాటు చేసిందన్నారు. శుభకార్యాలకు అవసరమైన వస్త్రాలు లభిస్తాయన్నారు. నేహా శెట్టిని చూసేందుకు ప్రజలు భారీగా వచ్చారు. కార్యక్రమంలో కాసం ఫణిత్, సాయి కృష్ణ, అరుణ్, ప్రవీణ్, కార్తీక్, వరుణ్, విశాల్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గద్దె దింపుతాం

- వచ్చే ఎన్నికల్లో ముదిరాజ్‌ల సత్తా చూపుతాం
- ఎమ్మెల్యే ఈటల రాజేందర్
- ఎమ్మెల్యే సీట్ల కేటాయింపులో కేసీఆర్ అన్యాయం
- పరిగిలో పండుగుల సాయన్న, కృష్ణస్వామి విగ్రహాల ఆవిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

పరిగి: అధికార అహంకారంతో బీఆర్‌ఎస్ ముదిరాజ్‌లకు అన్యాయం చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పండుగుల సాయన్న, హైదరాబాద్ తొలి మేయర్ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహాల ఆవిష్కరణకు ఈటల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముదిరాజ్‌ల మీద బీఆర్‌ఎస్‌కు నమ్మకం లేనప్పుడు వారు ఎలా విశ్వాసం చూపుతారని అన్నారు. అసెంబ్లీ సీట్ల కేటాయింపులో ముదిరాజ్‌లకు స్థానం లేకుండా చేసిన బీఆర్‌ఎస్‌కు రాష్ట్రంలో స్థానం కోల్పోయేలా చేస్తామని హెచ్చరించారు. పార్టీలకు, జెండాలకు అతీతంగా ముదిరాజ్‌లు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ముదిరాజ్‌లను ఏకం చేసేందుకు వచ్చే నెల 8న నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు, నీళ్లు, నిధులు వస్తాయి అనుకుంటే, నేడు వీటి కోసమే పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రతి శాఖ ఉద్యోగులు సమ్మెలు చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పుడు ఎందుకు వారి సమస్యలను పట్టించుకోవడం లేదని నిలదీశారు. అన్ని వర్గాలను మోసం చేసిన సీఎంకు, బీఆర్‌ఎస్ పార్టీకి పుట్టగతులు లేకుండా పోతాయని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గద్దె దింపుతామన్నారు.

పోరాట యోధుడు సాయన్న

అనంతరం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. సాయన్న గొప్ప బహుజన వాది అని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి సాయన్న అని కొనియాడారు. ఉన్న వారి నుంచి దోచుకొని లేని వారికి దానం చేశారని పేర్కొన్నారు. అయితే నేడు రాజకీయంగా, ఆర్థికంగా ముదిరాజ్‌లను అణగదొక్కేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ముదిరాజ్‌లు ఏకమై హక్కుల సాధన కోసం పోరాటం చేయాల్సి ఉందన్నారు. మన ఓట్లు మనం వేసుకున్నా రాష్ట్రంలో దాదాపు 20 అసెంబ్లీ సీట్లు గెలుచుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం ముదిరాజ్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాసాని వీరేష్ మాట్లాడారు. సబ్బండ వర్గాల రాజ్యాధికారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం జాతీయ డైరెక్టర్ వెంకటేశం, మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు మద్దతు

విగ్రహావిష్కరణకు అంతకుముందు ఇటీవల మృతి చెందిన హరీశ్వర్‌రెడ్డి ఇంటికి వెళ్లిన ఈటల రాజేందర్ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న స్వచ్ఛ ఈ సేవ కార్యక్రమం పాల్గొన్నారు. అక్కడే నిరవధిక సమ్మె చేస్తున్న ఆశావర్కర్లుకు మద్దతు తెలిపారు.

అప్పుడు ప్రాణాలు తీశాడు.. ఇప్పుడు ప్రాణం తీసుకున్నాడు

- భార్య, కుమారుడి హత్య కేసులో నిందితుడి ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్: అదనపు కట్నం కోసం భార్య, కుమారుడిని హత్య చేసిన నిందితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన ధన్‌రాజ్ (35) ఆదివారం మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ధన్‌రాజ్ మార్చి 15న భార్య లావణ్య (28), కుమారుడు క్రియాన్స్(రెండు నెలలు)ను హత్య చేయడంతో పోలీసులు రిమాండ్‌కు తరలించారు. రెండు నెలల క్రితం బెయిల్‌పై వచ్చిన నిందితుడు బంధువులు వద్ద ఆశ్రయం పొందాడు. వారం రోజుల క్రితం సొంత గ్రామం అనాజ్‌పూర్‌కు వచ్చి తండ్రితో పాటు నివాసం ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనాథగా మారిన కుమార్తె

తండ్రి చేతిలో తల్లి, తమ్ముడు ప్రాణాలు కోల్పోగా, తండ్రి ధన్‌రాజ్ ఆత్మహత్య చేసుకోవడంతో కుమార్తె ఆద్య అనాథగా మారింది. ఆరు నెలలుగా బండరావిరాలలోని తన అమ్మమ్మ ఇంటి దగ్గరే ఉంటోంది. తండ్రి కూడా తనువు చాలించడంతో ఆద్య ఇప్పుడు ఒంటరి అయ్యిందని స్థానికులు, బంధువులు కంటతడి పెట్టారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు చేపట్టిన సమ్మె ఆదివారానికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు పట్టణ చౌరస్తాలో నిరసన చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన రాజు మాట్లాడుతూ.. ఆశ వర్కర్లు తమ డిమాండ్లు పరిష్కరించాలని ఎంతో కాలంగా కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. చాలీచాలని వేతనాలతో వారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ధరల పెరుగుదలకు అనుగుణంగా ప్రభుత్వం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్‌సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్‌ను నెలకు రూ.వెయ్యి చొప్పున 16నెలల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని గుర్తు చేశారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద పర్యాటకులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

కోట్‌పల్లి ప్రాజెక్టు అందాలను తిలకించడానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలి వచ్చారు. సమీప అటవీ ప్రాంతంలో హాయిగా సంచరించారు. ప్రాజెక్టు నీటిలో సరదాగా ఈత కొట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్దలు, పిల్లలు ఎంజాయ్ చేశారు. గత సంఘటన నేపథ్యంలో అధికారులు ప్రాజెక్టు దారులను మూసేసినా పర్యాటకుల రాక మాత్రం ఆగడం లేదు.

– ధారూరు



నీటిలో ఎంజాయ్ చేస్తున్న మహిళలు, చిన్నారులు

క్లుప్తంగా

ఆర్‌ఎంపీ వైద్యుడిపై దాడి

గొంతు కోసిన దుండగులు



గాయాల పాలైన మక్బూల్ అహ్మద్

తాండూరు టౌన్: ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఆర్ఎంపీ వైద్యుని గొంతు కోసి పరారయ్యారు. ఈ సంఘటన తాండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు, ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాత తాండూరుకు చెందిన మక్బూల్ అహ్మద్ ఆర్ఎంపీగా సేవలందిస్తున్నాడు. శనివారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వైద్యం చేయాలని వచ్చారు. సమయం మించిపోయిందని, రేపు రావాలని వారితో సూచించాడు. దీంతో కోపోద్రిక్తులైన దుండగుల్లో ఒకరు కత్తి తీసి అతని గొంతు కోశాడు. అనంతరం వైద్యుడు వారితో పెనుగులాడే క్రమంలో చేతి వ్రేళ్లకు గాయాలయ్యాయి. అరుపులు విన్న స్థానికులు అక్కడికి చేరుకునే సరికి అక్కడి నుంచి వారు పారిపోయారు. క్షతగాత్రుణ్ని హుటాహుటిన జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. దుండగులపై పట్టణ పోలీసులకు ఆర్ఎంపీ వైద్యుడు ఫిర్యాదు చేశాడు.

చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య



పార్వతమ్మ మృతదేహం

యాలాల: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండల పరిధిలోని అగ్గనూరులో ఆదివారం జరిగింది. ఎస్ఐ అరవింద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగలి పార్వతమ్మ(60) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం గ్రామ శివారులో గల చెరువులో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించి గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతురాలి కొడుకు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి..

చెరువులో పడి వ్యక్తి మృతి



బందెయ్య (ఫైల్)

ధారూరు: రాత్రి వేళ చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో మునిగి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అంపల్లి గ్రామానికి చెందిన ఏదుల బందెయ్య(46) శనివారం రాత్రి చేపలు పట్టడానికి స్థానిక చెరువులోకి వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో చెరువులో వల వేశాడు. కొద్దిసేపటి తర్వాత దానిని తీసుకరావడానికి చెరువు నీటిలోకి దిగాడు. వలను తీసుకొచ్చే క్రమంలో అతని కాళ్లకు చుట్టుకొని ఈత కొట్టేందుకు వీలుకాక నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. అదేరోజు రాత్రి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చెరువులో గాలించినా లాభం లేకపోవడంతో ఆదివారం ఉదయం వెళ్లి చూడగా బందెయ్య శవం లభ్యమైంది. ఈ విషయం గురించి పోలీసులను ప్రశ్నించగా తమకు ఏలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

కల్లు కాంపౌండ్‌లో వ్యక్తిపై దాడి

నిందితుడిపై కేసు నమోదు

మర్పల్లి: కల్లు కాంపౌండ్‌లో ఓ వ్యక్తిపై దాడి జరిగింది. ఈ సంఘటన ఆదివారం మర్పల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మర్పల్లికి చెందిన చాకలి శ్రీశైలం, చాకలి రాజు అలియాస్ చంద్రశేఖర్ కల్లు తాగేందుకు స్థానిక కల్లు కాంపౌండ్‌కు వెళ్లారు. అక్కడ ఇరువురు గొడవ పడ్డారు. అక్కడే ఉన్న ఈడిగి గోపాల్, ఈడిగి రాజు అండతో చాకలి రాజు కల్లు సీసా పగుల గొట్టి శ్రీశైలంపై దాడి చేశాడు. దీంతో అతనికి బలమైన గాయాలవడంతో చికిత్స నిమిత్తం శ్రీశైలాన్ని కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి పంపించారు. బాధితుడి తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పత్తి రైతు.. చిత్తు!

- రాలుతున్న గూడ
- పూర్తిగా పాడైన మొక్కజొన్న
- కన్నీటి పర్యంతమవుతున్న కర్షకులు
- పెట్టిన పెట్టుబడి వస్తే సరేనంటున్న వైనం
- తలలు పట్టుకుంటున్న అన్నదాతలు



ధారూరు సమీపంలో సాగుచేసిన పత్తి



సాళ్ల పక్కనే రాలిన పూలు

ధారూరు: చేతికొస్తుందనుకున్న పత్తికి చీడపీడ ఎక్కువైంది. వివిధ రకాల పురుగులు విజృంభిస్తుంటే మరోవైపు తుపాను, వానలతో పత్తి చిత్తవుతుంది. ఆగస్టులో వానలు కరువయ్యాయి. చుక్కనీరు కానరాలేదు. అనావృష్టితో పత్తి ఎదుగుదల ఆగిపోయింది. మరోవైపు ఎన్నడు లేనంతగా వివిధ రకాల తెగుళ్ల వ్యాప్తి పెరిగింది. మొక్కజొన్న అనావృష్టితో చేతికి రాకుండానే పూర్తిగా పాడైంది. ఇప్పుడు పత్తి వంతైంది. ఇదీ క్రమంగా దెబ్బతింటోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధారూరు మండలంలో ఈ సవంత్సరం 14,090 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. విస్తీర్ణం పెరిగినా రోగాలు మాత్రం వదలడం లేదు. ప్రస్తుతం రోజు కురుస్తున్న వానలకు గూడ, కాయ రాలుతున్నాయని రైతులు చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితి కారణంగా మొదట్లో నీరందక పూత, కాత సరిగ్గా రాలేదు. గత వారం రోజుల నుంచి కాయ తొలుచు పురుగు, రసం తొలుచు పురుగులతో పాటు ఎండుతెగులు, పచ్చదోమ, పేనుబంక, తామరపురుగు, ఎర్రనల్లి తదితర తెగుళ్లు వరుసగా దాడిచేస్తున్నాయని రైతులు లబోదిబో మంటున్నారు. లేత ఆకుల నుంచి పురుగులు రసాన్ని పీల్చడంతో పువ్వు రాలుతుందని చెబుతున్నారు. జీవ ప్రక్రియ వలన వచ్చే మార్పులు, కాయతొలుచు పురుగు వలన పత్తికి నష్టం జరుగుతుందన్నారు. నీటి ముంపునకు గురైై కూడా పూత, పిందే రాలుతుందని వారు తెలిపారు. రోజు కురుస్తున్న వానలకు తేమశాతం ఎక్కువై పూత, పిందె రాలుతుందన్నారు. పోషక పదార్థాలు, హార్మోన్లు పిచికారి చేయడం ద్వారా కొంతవరకు పూత రాలడం, పిందె పడిపోవడాన్ని అరికట్ట వచ్చని క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి సంజూరాథోడ్ తెలిపారు. నూతన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల పూత, పిందె రాలడాన్ని అరికట్టొచ్చని ఆయన సూచించారు.

పూత, పిందె రాలుతుంది..



వారం రోజుల నుంచి పడుతున్న వానలకు పూత, పిందె రాలుతుందని రైతు కెతావత్ గోపాల్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఎకరా 20 గంటల్లో పత్తిని సాగుచేసి ఇప్పటివరకు రూ. 25 వేలు వ్యయం చేశానని, ఇకముందు కూడా మరో రూ.15వేల వరకు ఖర్చవుతుందని రైతు వివరించారు. ఇలాగే పూత, పిందె రాలుతుంటే పెట్టిన పెట్టుబడి దక్కే పరిస్థితి ఉండదు.

– కెతావత్ గోపాల్, రైతు, ఎల్‌సీతండా, ధారూరు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవాబుపేట: గ్రామాల అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని అత్తాపూర్, అక్నాపూర్, నారే గూడ, గంగ్యాడ, గొల్లగూడ, లింగంపల్లి, మైతాఫ్ ఖాన్గూడగూడ గ్రామాల్లో ఆదివారం రూ. 6.75కోట్లతో సీసీ రోడ్లు అంతర్గత మురుగు కాలువలు, బీటీ రోడ్లు, పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యావత్ దేశం తెలంగాణ వైపు చూస్తుందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే మళ్లీ గెలిపిస్తాయన్నారు. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు పరుస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు గౌరవంగా బ్రతకాలని పింఛన్ల పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి, సర్పంచులు స్వరూప, అజయ్ కుమార్, పరమయ, గోవిందమ్మ, శ్రీనివాస్ గౌడ్, నర్సింలు, అనిత రంగారెడ్డి, సుభాన్ రెడ్డి, బలవంత్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు నాగిరెడ్డి, సీనియర్ నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, రంగారెడ్డి, ప్రభాకర్, మల్లేశం, ప్రకాశం, శాంత కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే



ఎన్నికైన నూతన కమిటీ

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల పరిధిలోని బండమీదితండా గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగుబలహీనవర్గాల ప్రజలకు నాటి ఇందిరమ్మ ప్రభుత్వం మాత్రమే మేలు చేసిందని, ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనలో గిరిజనులు ఎన్నో ఇబ్బందుల మధ్య జీవనాన్ని గడుపుతున్నారన్నారు. పేరుకే తండాలను గ్రామపంచాయతీలుగా ప్రకటించారు. వీటికి ప్రత్యేకంగా ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదన్నారు. గిరిజన ఆవాసాలు బాగుపడాలన్నా, సంక్షేమ పథకాలు అందాలన్నా కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా విష్ణునాయక్, ప్రధాన కార్యదర్శిగా మాణిక్ నాయక్, ఉపాధ్యక్షుడిగా పి లక్ష్మణ్, మహిళ విభాగం అధ్యక్షురాలుగా నీలమ్మ, ప్రధాన కార్యదర్శిగా దానమ్మ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు మహేశ్, సోషల్ మీడియా కన్వీనర్ భాస్కర్, సోమలింగం ఉన్నారు.

పార్టీ మారితే ఒరిగేదేమీ లేదు!

బీఆర్ఎస్ వైస్ ఎంపీపీ మల్లేశం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

దోమ: బీఆర్ఎస్ నుంచి ఎంపీపీ అనసూయ కాంగ్రెస్‌లోకి మారితే తమ పార్టీకి ఒరిగేదేమి లేదని వైస్ ఎంపీపీ మల్లేశం అన్నారు. ఆదివారం దోమ మండల కేంద్రంలో మండల బీఆర్ఎస్ నేతలతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో ఎంపీపీ అనసూయ కుటుంబానికి మంచి గుర్తింపు ఉండేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ దివంగత నేత హరీశ్వర్‌రెడ్డితో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఎంపీపీ కుటుంబాన్ని ఎంతో నమ్మారన్నారు. ఎన్నో పదవులు కట్టాబెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాంటి వారిని విస్మరించి కాంగ్రెస్‌లో చేరడం సిగ్గు చేటని మండిపడ్డారు. విద్యార్థి దశ నుంచే కొప్పుల కుటుంబంలో ఉంటూ రాజకీయాలు నేర్చుకున్న సంగతి మర్చిపోయారా? అని ప్రశ్నించారు. ఎన్నో పదవులు, సబ్సిడీ యంత్రాలు, అంగన్‌వాడీ టీచర్ పోస్టు, చౌకధరల దుకాణం దక్కిన విషయాన్ని మర్చిపోతున్నారా? అని ప్రశ్నించారు. సొంత గ్రామం పోతిరెడ్డిపల్లిలో సర్పంచ్‌గా ఓడిపోయిన తర్వాత ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి ఎంపీటీసీగా బరిలో ఉంచి గెలిపించుకుని ఎంపీపీ స్థానాన్ని కట్టబెట్టిన విషయం గుర్తుకు రాదా? రెండు పర్యాయాలుగా మండల బీఆర్ఎస్ అధ్యక్షుడిగా కుమారుడు రాఘవేందర్‌రెడ్డిని కొనసాగించిన విషయాన్ని విస్మరించారా? అని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో పోతిరెడ్డిపల్లిలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ లక్ష్మయ్య ముదిరాజ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, బొంపల్లి ఎంపీటీసీ రాఘవపురం రాములు, మాజీ ఎంపీపీ రాజగోపాలచారి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్, షఫీ, డి.వెంకటేశ్, శ్రీనివాస్ యాదవ్, మైనోద్దీన్, రమేశ్, అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మర్పల్లి: గురువులతో పూర్వవిద్యార్థులు

మర్పల్లి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యాసంవత్సరం పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులు, తోటి మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. యోగ క్షేమాల గురించి మాట్లాడుకున్నారు. పేదరికంలో ఉన్న తోటి విద్యార్థులను పలుకరించి ఆర్థికంగా ఆదుకుంటామని భరోస కల్పించారు. అనంతరం విద్యాబోధన చేసిన 9 మంది ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్థికంగా స్థిరపడ్డ కొంతమంది విద్యార్థులు పాఠశాలలో బెంచీలు, కుర్చీలు వంటివి ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ బ్యాచ్ విద్యార్థులు సుమారు 60 మంది పాల్గొన్నారు.

మేరియే నాట్స్ పాఠశాలలో..

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని మేరియే నాట్స్ పాఠశాలలో 1979 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సందడి చేశారు. సత్యభారతీ ఫంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 40 ఏళ్ల తరువాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులైన మార్త, ఫరీదా, శ్యాముల్, ప్రభాకర్, కళావతి, లత, నీతన్, రోడా టీచర్లను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

‘చలో అలంపూర్’ విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ

శంకర్‌పల్లి: ఈ నెల 4వ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే విశ్వరూప పాదయాత్రను విజయవంత చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ పిలుపునిచ్చారు. ఆదివారం శంకర్‌పల్లి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి శివకుమార్, నాయకులు వంశీ, శ్రీకాంత్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విదేశీ బాట పట్టకండి

- వైద్య వృత్తి పవిత్రమైంది
- పేదలకు వైద్యం అందించండి
- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: ఎంబీబీఎస్ చదివి డాక్టర్లు అయ్యాక విదేశీ బాట పట్టకుండా గ్రామీణ పేదలు, బాధితులకు వైద్యం అందించాలని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సూచించారు. చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఆదివారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైద్య విద్యను అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో వైద్య విద్యకోసం కర్ణాటక, మహారాష్ట్ర ఇతర రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు తెలంగాణలో జిల్లాకో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. ఓరియంటేషన్ సందర్భంగా విద్యా, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు మంత్రి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంతోశ్‌రెడ్డి, వరదారెడ్డి, మహేశ్‌కుమార్, రాజిరెడ్డి, జోయారాణి, సత్యనారాయణ, గౌరీ, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటం చేయడమే తప్పా?

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: ప్రజాసమస్యలపై పోరాటం చేయడమే తప్పా అని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు రెండు రోజులు రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. అయితే దీక్షను పోలీసులు భగ్నం చేసి, అరెస్ట్ చేశారు. అరెస్టును ఖండిస్తూ ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు గత ఎన్నికల్లో ప్రభుత్వ ఆస్పత్రి, జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హామీని నేరవేర్చక పోవడంతో దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. అక్రమ అరెస్ట్‌కు నిరసనగా సోమవారం కడ్తాల్ బంద్‌కు పిలుపునిచ్చారు. బంద్‌కు ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కృష్ణ, యూసుఫ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

బడంగ్‌పేట లడ్డూ రేవంత్‌కు బహూకరణ



లడ్డూను రేవంత్‌రెడ్డికి బహూకరిస్తున్న వెంకట్‌రెడ్డి దంపతులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట వీరాంజనేయ భక్త సమాజం లడ్డూను మాజీ ఉప సర్పంచ్, బడంగ్‌పేట కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి రూ.17 లక్షలకు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ లడ్డూను ఆదివారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి బహూకరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లు సాధించి అధికారంలోకి రావాలని గణనాథున్ని వేడుకున్నట్లు వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుకర్‌రెడ్డి, పుష్పలత, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పేరుకుపోయిన ఇసుక

వాహనదారుల ఇక్కట్లు

- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై పేరుకుపోయిన ఇసుక

వికారాబాద్ అర్బన్: ఇటీవల కురిసిన వర్షాలకు ఎల్ఐసీ రోడ్డుపై ఇసుక పేరుకుపోయి ప్రమాదకరంగా తయారైంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీఆర్ఎస్ కార్యాలయం నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు రోడ్డుపై ఇసుక పేరుకుపోయి రాకపోకలకు ఆటంకంగా నిలిచింది. ఇటీవల పడ్డ భారీ వర్షాలకు పెద్ద ఎత్తున ఇసుక రోడ్డుపైకి చేరింది. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఇసుకను తొలగింపజేయాలని వారు కోరుతున్నారు.

లాభాల తోట

- పంటలకు సస్యరక్షణ
- సంప్రదాయ పంటలపై అనాసక్తి
- ఉద్యాన పంటలపై మక్కువ
- పండ్లతోటలు, ఆకు కూరలు సాగులో తీసుకోవాల్సిన చర్యలు



టమాట పంటను పరిశీలిస్తున్న సునందరెడ్డి

షాబాద్: ప్రస్తుతం సాగులో పెట్టుబడులు కొండంత.. లాభాలు గోరంత ఉన్నాయి. పైగా ప్రకృతి ప్రకోపానికి పంట చేతికి వస్తుందో? రాదో తెలియని పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ వ్యయసాయంపై మొగ్గుచూపడం లేదు. వరి, పత్తి, ఇతర సంప్రదాయ పంటల సాగు విస్తీర్ణం తగ్గించుకుంటున్నారు. అధిక లాభాలు వచ్చే కూరగాయల పంటలు పండించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. పండ్ల తోటలు, కూరగాయల పంటల సాగుకే సై అంటున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యాన తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఉద్యానశాఖ అధికారి డాక్టర్ సునందరెడ్డి సాక్షితో ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

పండ్ల తోటలు...

మామిడిలో కాండం తొలుచు పరుగు ఆశించే అవకాశం ఉంటుంది. పురుగు ఆశించిన పక్షంలో బయటకు లాగి చంపివేయాలి. రంధ్రాల్లో మిథైల్ పెరాథియాన్ 50 శాతం మందును 1 మిల్లీ లీటర్ నీటికి కలిపిన ద్రావణం లేదా పెట్రోల్ లేదా అల్యూమినియం ఫాస్ఫైడ్ బిళ్లలు వేసి బంక మట్టితో మూసివేయాలి.

అరటి సాగులో..

అరటిలో తల్లి మొక్క చుట్టూ వచ్చే పిలకల కోతకు ఉపయోగించే కొడవలిని ప్రతిసారి డీజిల్, కిరోసిన్‌లో ముంచి వైరస్ తెగుళ్ల వ్యాప్తిని నివారించాలి. పచ్చ అరటి, కొవ్వూరు బొంత, కర్పూర చెక్కరకేళి రకాలను రెండో దఫాగా 110 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఇచ్చి తేలికపాటి తడి ఇవ్వాలి.

జామ..

జామ పంటలో కాయలు పెరిగే దశలో నీటి తడులు ఇవ్వాలి. తొడిమ కుళ్లు తెగులు నివారణకు 1 శాతం బోర్డో మిశ్రమం లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటిలో కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

కూరగాయ పంటలు..

టమాట, వంగ, బెండ సాగులో వైరస్ తెగుళ్ల వ్యాప్తిని అరికట్టేందుకు రసం పీల్చే పురుగులను నివారించాలి. రసం పీల్చే పురుగుల నివారణకు ఫాసలోన్, ఫ్రిప్రోనిల్, డైమిథోయేట్ మందుల్లో ఏదైనా ఒక మందును లీటర్ నీటికి 2మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

తీగజాతి కూరగాయలు..

తీగజాతి కూరగాయలను ఆశించే బూడిద తెగులు నివారణకు కెరాథేన్ 1 మిల్లీ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పండు ఈగ నివారణకు 2 మిల్లీ లీటర్ మలాథియాన్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా మలాథియాన్ 100 మిల్లీ లీటర్ 100 గ్రాములు చెక్కర లేదా బెల్లం 10 లీటర్ నీరు కలిపి విషపు ఎర తయారు చేసి మట్టి మూకుడులో లేదా ప్లాస్టిక్ పళ్లాలలో పోసి ఎకరాకు 10–12 మూకుడులను అక్కడక్కడ పెట్టాలి.

పసుపు పంట సాగులో

పసుపు పంట పెరుగుదల, నేలలో తేమ సంరక్షణ చర్యలు చేపట్టాలి. నాటిన 80 రోజులకు ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 100 కిలోల వేపపిండితో కలిపి వేయాలి. దుంప ఈగ ఆశిస్తే ఎకరాకు 200 కిలోల వేపపిండితో 10 కిలోల కార్బొఫ్యూరాన్ గుళికలు కలిపి మొక్క దగ్గర వేసి నీరు పెట్టాలి.